సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



జీతాలు ఇవ్వండి.. మహాప్రభో!

జీతాలు సకాలంలో అందక ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుమారు వెయ్యి మంది సిబ్బందికి ఇప్పటికీ జీతాలు రాలేదు. 10లో ▸



ప్రొటోకాల్ పాటించడం లేదు

అధికారులు కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని, జెడ్పీ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు మండిపడ్డారు. 10లో ▸



ఇంజినీరింగ్‌దే హవా

సాంకేతిక విద్యపై విద్యార్థులు ఆకర్షితులవడంతో ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ పెరిగింది. దీంతో ఈ కోర్సుల హవా నడుస్తోంది. 10లో ▸

ఆక్వా సాగుకు సెలవు

అయ్యో.. రొయ్య

- ధరల పతనంపై జిల్లా రైతుల పోరుబాట
- ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో క్రాప్ హాలిడే
- తొలుత జూలై నుంచి అమలుకు యోచన
- ఈనెల నుంచే పంట విరామంలోకి రైతులు
- మంత్రి నిమ్మల ఇలాకా నుంచే ఉద్యమం మొదలు
- ఇప్పటికే చెరువుల వద్ద ఫ్లెక్సీల ఏర్పాటు



పంట విరామం పాటిస్తున్నట్టుగా నరసాపురంలో ఓ రైతు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



సాక్షి, భీమవరం: ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎక్స్‌పోర్టర్ల దోపిడీని నిరసిస్తూ ఆక్వా చరిత్రలో తొలిసారి రైతులు సమ్మె బాట పట్టారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సొంత నియోజకవర్గం నుంచి దీనికి నాంది పలికారు. జూలై నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించగా పట్టుబడులు పూర్తిచేసుకున్న రైతులు ఇప్పటినుంచే పంటకు విరామమిచ్చి చెరువులను ఎండగట్టేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2.63 లక్షల ఎకరాల్లో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 2.63 లక్షల ఎకరాల ఆక్వా చెరువులకు 60 శాతం విస్తీర్ణంలో రొయ్యలు సాగవుతున్నాయి. ఏటా దాదాపు మూడు లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తితో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. స్థానికంగా 40కి పైగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. కిలోకు 30 నుంచి 50 లోపు కౌంట్ రొయ్యలు అమెరికాకు ఎగుమతి అవుతుంటే, 60 నుంచి 100 కౌంట్ రొయ్యలు చైనా, యూరోపియన్ దేశాలకు వెళుతున్నాయి.

టారిఫ్‌లు సాకుగా చూపి.. చి...

నెలన్నర రోజుల క్రితం 30 కౌంట్ (కేజీకి 30 రొయ్యలు) ధర రూ.470, 40 కౌంట్ రూ.415, 100 కౌంట్ రూ.260 వరకు ధర ఉంది. సాధారణంగా వేసవి ఉష్ణోగ్రతలు వనామీ సాగుకు అనుకూలంగా ఉంటాయి. పట్టుబడులు మొదలై మార్కెట్‌లోకి రొయ్యలు రావడం పెరగడంతో ధరలు తగ్గిస్తూ వచ్చారు. ఈనెల 3న అమెరికా ప్రతీకార సుంకాల ప్రకటన వెలువడే నాటికి 30 కౌంట్ ధర రూ.460, 40 కౌంట్ రూ.370, 100 కౌంట్ రూ.230కి ధరలు పడిపోయాయి. అమెరికా సుంకాలను సాగుకు చూపించి కౌంట్‌ను బట్టి కేజీకి రూ.30ల నుంచి రూ.70 వరకు కోత పెట్టి ఈ ధరలను మరింత తగ్గించేశారు. ఇప్పట్లో పన్నుల బాదుడు లేదని అమెరికా ప్రకటించినా తగ్గించిన ధరలను పెంచలేదు. ఫీడ్, ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు, ఎక్స్‌పోర్టర్లు సిండికేటై తమ కష్టాన్ని దోచుకుంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. గతంలోని 30 కౌంట్ రూ.470–490, 50 కౌంట్‌కు రూ.370, 60 కౌంట్‌కు రూ.350 కనీస మద్దతు ధర ఉండాలని, మేత ముడి సరకు ధరలు భారీగా తగ్గిన నేపథ్యంలో ఫీడ్ కంపెనీలు మేత ధరలను టన్నుకు రూ.20 వేలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఇలాకాలో ఫ్లెక్సీల ఏర్పాటు

మంత్రి నిమ్మల సొంత నియోజకవర్గమైన పాలకొల్లు నుంచి క్రాప్ హాలిడేని రైతులు ప్రారంభించారు. బుధవారం యలమంచిలి మండలం శిరిగాలపల్లిలో 10 ఎకరాల్లో పంట విరామం పాటిస్తున్నట్టు ఫ్లెక్సీని ఏర్పాటుచేయగా గురువారం నియోజకవర్గంలోని పూలపల్లి, చందపర్రు, నరసాపురం నియోజకవర్గంలోని తూర్పుతాళ్లు తదితర చోట్ల దాదాపు 50కి పైగా ఎకరాల్లోని రైతులు సమ్మెలోకి వెళుతున్నట్టుగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. పట్టుబడులు పూర్తి చేసుకున్న రైతులు ఒక్కొక్కరుగా పంటకు విరామమిస్తున్నారు. చెరువుల వద్ద క్రాప్ హాలిడే ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి వాటి వివరాలను అధికారులకు అందజేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఊరటనివ్వని 'ఉండి' సమావేశం

జిల్లాకు చెందిన జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల రైతులు ఈనెల 7న పాలకొల్లులో రాస్తారోకో చేశారు. మూడు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 60 వేల ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉండగా జూన్ నెలాఖరు నాటికి ప్రస్తుత సాగును పూర్తి చేసుకుని జూలై నుంచి సెప్టెంబరు వరకు పంట విరామం పాటించాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వంలో సాగు సమ్మె ప్రకంపనలు సృష్టించింది. సాగు సమ్మె విరమింపజేసే దిశగా సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజుతో జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు చర్చలు జరిపారన్న ప్రచారం జరిగింది. దీంతో ఈనెల 13న ఉండిలో జరిగిన ఆక్వా సదస్సులో తమకు మేలు జరుగుతుందని రైతులు ఆశించారు. ప్రభుత్వం నుంచి ఏదో జరుగుతుందని ఆశించవద్దు.. ప్రభుత్వాన్ని ఎంతవరకు వాడాలో అంతవరకే వాడుదాం.. అన్నింటికీ ప్రభుత్వం, ప్రభుత్వం అంటే కుదరదంటూ ప్రభుత్వ పెద్దలు ఆ సమావేశంలో చెప్పిన మాటలు ఆక్వా రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. మేత ధరలను కేవలం టన్నుకు రూ.4 వేలు మాత్రమే తగ్గించడం, 15న విజయవాడలో సమావేశమైన ప్రాన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ కంటితుడుపు నిర్ణయాలు రైతులను నిరాశకు గురిచేశాయి.

ఆక్వా రంగం కుదేలు



మేత, సీడ్, లీజు, మెడిసిన్ ధరలు 100 శాతం పెరగ్గా రొయ్య ధర మాత్రం పతనమవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు చేయడం చాలా కష్టం. ప్రస్తుత పరిస్థితిలో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. సాగు సమ్మెతోనే రైతులకు న్యాయం జరుగుతుంది.

– పొత్తూరి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, కలగంపూడి

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం ఆదుకోకపోతే ఆక్వాకు గడ్డు కాలమే. అమెరికా సుంకాల పేరు చెప్పి కౌంట్‌కు కిలోకు రూ.30 నుంచి రూ.70 వరకు ధరలు తగ్గించేశారు. సుంకాలు లేవని చెప్పినా ధరలు పెంచకుండా రైతులను దోచుకుంటున్నారు. మేత ధరలు తగ్గించి, రొయ్యల ధరలు పెంచేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి.

– కుక్కల సూరయ్య, ఆక్వా రైతు, మేడపాడు

న్యూస్‌రీల్

'ఫీజు' కోసం పోరు



భీమవరం కలెక్టరేట్ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన దృశ్యం

భీమవరం: నిబంధనలు మీరిన ప్రైవేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని, జీఓ 77, 107, 108లను రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలంటూ గురువారం భీమవరంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటగోపి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జీఓ 77 రద్దు చేస్తామని, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, అయినా వీటిని అమలు చేయలేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ డిన్ను చందు, జిల్లా కన్వీనర్ వెంకట్, రాష్ట్ర కార్యనిర్వాహకుడు సాయి, భీమవరం నగర కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు

తణుకు అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేశారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, పెన్షన్, గ్రాట్యుటీ ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని, సంక్షేమ పథకాలు ఇవ్వాలని నినదించారు. యూనియన్ అధ్యక్షుడు యు.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.విజయకుమార్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్నామని, తక్కువ వేతనాలతో బతకడం కష్టంగా ఉందన్నారు. సీఐటీయూ నాయకులు ఎన్.ఆదినారాయణ బాబు, దాసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గళమెత్తిన ఆర్టీసీ కార్మికులు



తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు

తణుకు అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎన్ఎంయూఏ తణుకు డిపో కమిటీ అధ్యక్షుడు సరిదే ఏసుబాబు డిమాండ్ చేశారు. తణుకు ఆర్టీసీ డిపోలో గురువారం కార్మికులు నిరసన తెలిపారు. 1–2009 సర్క్యులర్ ప్రకారం విధివిధానాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, 114 జీఓ ప్రకారం నైట్ అవుట్లకు రూ.400 జీతం ఇవ్వాలన్నారు. ఈహెచ్ఎస్ పద్ధతిలోనే పాత వైద్యవిధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే తీయాలని కోరారు. ఎన్ఎంయూఏ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. డిపో కార్యదర్శి బీవీఎస్ఎస్ సుబ్బారావు, కోశాధికారి ఎస్‌వీ రావు, సహాయ కార్యదర్శి టి.శ్రీను, ఉపాధ్యక్షుడు కేవీ రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎస్ రాజు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీవారికి కాసుల పంట



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదును స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం లెక్కించారు. చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. 20 రోజులకు నగదు రూపంలో రూ.1,93,36,657, 326 గ్రాముల బంగారం, 4.149 కిలోల వెండితో పాటు విదేశీ కరెన్సీ లభించినట్టు ఈఓ సత్యనారాయణమూర్తి తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.20 వేలు లభించాయన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కారుమూరి



ప్రమాదంలో గాయపడిన వృద్ధుడిని కారు ఎక్కిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తన సిబ్బందితో సపర్యలు చేయించి సురక్షితంగా ఆస్పత్రికి పంపించిన సంఘటన తణుకు మండలం వేల్పూరులో గురువారం చోటుచేసుకుంది. వేల్పూరుకు చెందిన వృద్ధుడు టీవీఎస్ మోపెడ్‌పై ఓ మహిళను ఎక్కించుకుని తణుకు వైపునకు వస్తుండగా తణుకు వైపు నుంచి వస్తున్న కారు ఆయన్ను ఢీకొట్టింది. ఇదే సమయంలో అటుగా వెళుతున్న కారుమూరి స్వల్పంగా గాయపడ్డ వృద్ధుడిని సముదాయించి ప్రమాదానికి కారకులైన కారులో ఉన్న వారితో వృద్ధుడిని ఆస్పత్రిలో చికిత్స చేయించాల్సిందిగా చెప్పి అదే కారులో ఎక్కించి పంపించారు. వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్ ఉన్నారు.

మున్సిపల్ అధికారులపై చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీలో పన్ను విధింపునకు సంబంధించి అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. పట్టణంలోని ఓ ఖాళీ స్థలానికి సంబంధించి పత్రాలు, స్థల పరిశీలన చేయకుండా పన్ను విధించిన వ్యవహారంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎస్.శివరామకృష్ణ, ఆర్వో డి.సోమశేఖర్, ఆర్ఐ ఎస్.కృష్ణమోహన్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీ పి.చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ (సీడీఎంఏ)కు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కార్యకర్తలకు అండగా జగన్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



తణుకులో నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా సంక్షేమం అందించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. తణుకు సీఎం ఫంక్షన్ హాలులో గురువారం తణుకు నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం సంస్థాగతంగా పార్టీని ప్రక్షాళన చేసే దిశగా వెళ్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు జగన్ పదవులు అందించారని గుర్తుచేశారు. సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. కేసులకు బెదరం.. చెదరం అని స్పష్టం చేశారు.

రాలిపోయే పువ్వు కేంద్రమంత్రి వర్మ : కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ రాలిపోయే పువ్వు అని, కేంద్ర మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి తనపై దిగజారి వ్యాఖ్యలు చేయడం తగదని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఎంపీగా నరసాపురం ప్రాంత ప్రజలకు ఏం చేయాలనే ఆలోచన లేకుండా చేతులు, కాళ్లు నరుకుతానని బాహాటంగానే అనడం దౌర్భాగ్యమన్నారు. రాజుల గౌరవాన్ని పాడుచేసేలా ఆయన భాష వాడకాన్ని చూస్తుంటే వర్మ వార్డు మెంబరుకు ఎక్కువ సర్పంచ్‌కు తక్కువ అని ఎద్దేవా చేశారు. ఆయన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పశువధ శాలలో ఆవులు, గేదెలు వధిస్తున్నందుకు వర్మకు ఎన్నికోట్లు ముట్టాయోనని తణుకు ప్రజలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. టీటీడీలో కూటమి ప్రభుత్వం వచ్చాక 45 గోవులు చనిపోతే నోరు విప్పలేకపోయావా వర్మా అని నిలదీశారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఎడిటింగ్ మాస్టర్ అని ఎద్దేవా చేశారు. ఏలూరులో తన మాటలను వక్రీకరించి సోషల్ మీడియాలో వదలడంతో రాష్ట్రవ్యాప్తంగా తానే పెరిగానని కారుమూరి అన్నారు. పావలా ఎమ్మెల్యేగా పేర్గాంచిన రాధాకృష్ణ హయాంలో పేకాటలు, కోడి పందేలు, క్రికెట్ బెట్టింగ్‌లు, మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని దుయ్యబట్టారు. జగన్ పాలనలో అందరికీ సంక్షేమం అందించారని అన్నారు. కూటమి పాలనలో సంక్షేమం అందించకుండా విద్యార్థులను, రైతులను, మహిళలను రోడ్డున పడేసేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి చేస్తున్న మారణకాండకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలు దుర్మార్గం

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ఇటీవల మాజీ మంత్రి కారుమూరిపై చేసిన వ్యాఖ్యలు దుర్మార్గంగా ఉన్నాయని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్, రాష్ట్ర ఎంబీసీ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. అత్తిలి ఎంపీపీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు ఫ్యాక్షనిజాన్ని తలపిస్తోందన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, పార్టీ యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, బహుజన కులాల రాష్ట్ర నేతలు చింతపల్లి గురుప్రసాద్ పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో నాయకులు

పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

తణుకు పాతవూరు 13వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ యువనేత పెనుమాక రాజేష్ ఆధ్వర్యంలో నేలపాటి నరేష్, వల్లూరి బుజ్జిబాబు, గుంటూరి నాగేశ్వరరావు, నేలపాటి ఏసురత్నం, గుమ్మడి శ్రీను, నేలపాటి రాంబాబు పార్టీలో చేరారు.

తప్పులు లేకుండా ఓటర్ల చేర్పులు, మార్పులు


కలెక్టర్ నాగరాణి




సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు క్లయిమ్స్ పరిష్కార ప్రక్రియను తప్పులు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. టీడీపీకి చెందిన మరపట్ల శ్యాంబాబు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు నమోదులో డబుల్ ఎంట్రీలు ఉన్నాయని అన్నారు. ఆరు నెలల డేటాను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 14,70,886 మంది ఉండగా, పురుషులు 7,20,613 మంది, మహిళలు 7,50,197 మంది, ట్రాన్స్‌జెండర్లు 77 మంది ఉన్నారన్నారు. ఫారం–6 ఓటు నమోదుకు 906 మంది దరఖాస్తు చేసుకోగా 741 పరిష్కరించామని, 73 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం–8 మార్పులు, చేర్పులకు 2,491 క్లయిమ్స్‌కు 2,135 పరిష్కరించగా 125 తిరస్కరించామని, 232 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కలెక్టరేట్ ఇన్‌చార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, యు.చంద్రశేఖర్ (టీడీపీ), జె.శివ (జనసేన), కామన నాగేశ్వరరావు (వైఎస్సార్‌సీపీ), ఎం.రామాంజనేయులు (సీపీఎం), ఎం.రత్నరాజు (బీఎస్పీ) పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతపై భగ్గుమన్న పేదలు



బొండాడలో పొక్లెయిన్‌తో ఇళ్లు కూలుస్తున్న దృశ్యం



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

కాళ్ల: బొండాడలోని మెయిన్‌రోడ్డులో పేదల ఇళ్ల కూల్చివేత ఉద్రిక్తతకు దారి తీసింది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో పోలీసుల సమక్షంలో పంచాయతీ అధికారులు గ్రామంలోని 28 ఇళ్లను కూల్చేందుకు పొక్లెయిన్‌ను తీసుకురాగా పేద బాధితులు, సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ ప్రతిఘటించారు. ఈ సమయంలో పోలీసులు, బాధితుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆకివీడు సీఐ జగదీశ్వర్‌రావు, ఆకివీడు, భీమవరం రూరల్, కాళ్ల ఎస్సైలు, పోలీసులు, పోలీసుల బందోబస్తుతో పేదలు, బాధితులను నిర్బంధించారు. సీపీఎం నేత రామకృష్ణను అరెస్ట్ చేసి కాళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొక్లెయిన్‌తో ఇళ్లను కూల్చివేశారు. దీంతో మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఇక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కూల్చివేతను అడ్డుకుంటున్న మహిళలను పోలీసులు ఓ చోట నిర్బంధించారు. మహిళలు అని కూడా చూడకుండా దౌర్జన్యం చేయడం అన్యాయమని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బొండాడలో తొలగించిన ఇళ్లకు ఆనుకుని ఇరిగేషన్ పోరంబోకు భూమి 79 సెంట్లు ఉందని, అక్కడ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పన్ను వేలం తగ్గింపుపై అభ్యంతరం

- ప్రభుత్వానికి నివేదించాలని నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం
- నరసాపురంలో కూటమి నేతలకు షాక్





నరసాపురంలో సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

నరసాపురం: నరసాపురం మున్సిపల్ మార్కెట్‌లో రోజువారీ పన్ను వసూళ్ల (2025–26) హక్కులకు సంబంధించి బహిరంగ వేలం పాట అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. వైఎస్సార్‌సీపీ మెజార్టీ కౌన్సిలర్లు తీసుకున్న ఈ నిర్ణయం కూటమి నేతలకు షాక్ ఇచ్చినట్టయ్యింది. గురువారం పన్ను పాట అంశం సింగిల్ అజెండాగా చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. కొన్నిరోజులుగా వేలం విషయమై మున్సిపాలిటీ హైడ్రామా నడుస్తోంది. గతేడాది రూ.82 లక్షలకు పాట వెళ్లగా ఈ ఏడాది ఓ జనసేన నేతకు రూ.30 లక్షలకు పాటను ఖరారు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఇబ్బందులొస్తాయని భావించి రూ.45 లక్షలకు ఓ టీడీపీ నేతకు కట్టబెట్టాలని అధికారులు తాపత్రయపడ్డారు. అయితే వీరి ప్రయత్నానికి కౌన్సిల్ అత్యవసర సమావేశంలో చుక్కెదురయ్యింది. మూడేళ్ల సగటును తీసుకుని రూ.70 లక్షలకు తగ్గకుండా పాట జరగాలని, మున్సిపల్ ఆదాయానికి గండి కొడతామంటే సహించేది లేదని కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం ద్వారా తేల్చిచెప్పింది.

వేలంలో స్పష్టత కరువు

మార్కెట్ పాట వ్యవహారంలో గందరగోళానికి అధికారుల వైఖరే కారణమని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు, సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత ఏడిద కోట సత్యనారాయణ (వైకేఎస్) ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలం పాటకు సంబంధించి పలు అంశాల్లో స్పష్టత లేదన్నారు. ప్రస్తుతం మున్సిపల్ సిబ్బందే పన్నులు వసూలు చేస్తున్నా.. సరైన రీతిలో జరగడం లేదన్నారు. మున్సిపాలిటీలో జీతాలు తీసుకుంటూ అధికారులు మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టాలని చూడటం దారుణమన్నారు. పదేళ్లలో ఎన్నడూలేని విధంగా పన్నుపాట ఎందుకు తగ్గిందని వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని ప్రశ్నించారు. పాట తక్కువగా వెళ్లడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయం కోల్పోతుందని.. తీర్మానం చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రకటించారు. చర్చలో కోటిపల్లి సురేష్, వన్నెంరెడ్డి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, బొంతు రాజశేఖర్ పాల్గొన్నారు. మున్సిపాలిటీలో అధికారుల పనితీరు దారుణంగా ఉందని, గోదావరి పుష్కరాల నిర్వహణ విషయంలో, స్థానికంగా జరగాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు విషయంలో అసలు కదలిక లేదని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు.

క్లుప్తంగా

రూ.46.95 లక్షల మిగులుతో జెడ్పీ బడ్జెట్ ఆమోదం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ బడ్జెట్‌ను రూ.46.95 లక్షల మిగులుతో ఆమోదించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఈమేరకు సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా పరిషత్ మొత్తం ఆదాయం రూ.153.16 కోట్లుగా, వ్యయం రూ.152.69 కోట్లుగా అంచనా వేశారు. దీంతో రూ.46.95 లక్షలు మిగులుతో బడ్జెట్‌ను ఆమోదించారు.

సమన్వయంతో పనిచేద్దాం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని మూడు జిల్లాల్లో అభివృద్ధిలో కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె మొదటగా 1వ, 7వ స్థాయి సంఘాల సమస్యలు, రెండవ విడతగా 2, 3, 4, 5, 6 స్థాయి సంఘాల సమావేశాల్లో ఆయా అంశాలపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన కొన్ని పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో కె.భీమేశ్వరరావు, మూడు జిల్లాల వివిధ శాఖల అధికారులు, పలువురు జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

మొగల్తూరు రోడ్డు ప్రమాద ఘటనలో మరో వ్యక్తి మృతి



గుబ్బల మాణిక్యాలరావు (ఫైల్)

నరసాపురం: మొగల్తూరులో 216 జాతీయ రహదారి పక్కన పని చేసుకుంటున్న ఉపాధి హామీ కూలీలపై బుధవారం అదుపుతప్పి దూసుకొచ్చిన నూనె డబ్బాల వ్యాన్ బోల్తా ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుబ్బల మాణిక్యాలరావు (65) బుధవారం రాత్రి మృతి చెందాడు. ప్రమాదంలో మాణిక్యాలరావు భార్య గంగావతి, మరో మహిళ కడలి పావని అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మాణిక్యాలరావును మొదట నరసాపురం ఏరియా ఆసుపత్రికి, తరువాత మెరుగైన వైద్యం కోసం భీమవరం అక్కడ నుంచి గుంటూరు తరలించారు. ప్రమాదంలో లివర్ దెబ్బతినడంతో మాణిక్యాలరావు మృతి చెందాడు. కాగా నరసాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో కూలీ గుడాలి సత్యనారాయణను మెరుగైన వైద్యం నిమిత్తం గురువారం భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ప్రాంతాల్లో కూడా వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో స్వచ్ఛఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేందుకు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీపీఓలతో ఇప్పటికే చర్చించామని, ఇందుకు కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌దే హవా



- మే 19 నుంచి ఈఏపీ సెట్ పరీక్షలు
- తొలి రెండు రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు
- మే 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశాలకు పరీక్షలు
- ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 14 ఇంజినీరింగ్ కళాశాలలు
- అందుబాటులో 13,330 సీట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దాదాపు దశాబ్ద కాలానికి పైనుంచే విద్యార్థులు సాంకేతిక విద్యబాట పట్టారు. గతంలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన తరువాత డిగ్రీ కోర్సుల్లోకి ప్రవేశించడం సంప్రదాయంగా వచ్చింది. అనంతర కాలంలో ప్రపంచం మొత్తం మీద వచ్చిన సాంకేతిక విప్లవం ఆధారంగా కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండడం, ప్రభుత్వ ఉద్యోగస్తుల కంటే ఎక్కువగా జీతాలు వచ్చే అవకాశం ఈ రంగంలో ఉండడంతో విద్యార్థులు సైతం సాంకేతిక విద్యపై ఆకర్షితులయ్యారు. దీనితో ఇంజినీరింగ్ కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఇంజినీరింగ్ కోర్సుల హవా నడుస్తోంది. ఇంటర్మీడియెట్ అనంతరం ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశించడం కోసం ప్రభుత్వం ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలను ఏపీఈఏపీ సెట్ పేరిట నిర్వహిస్తోంది. ఇటీవల ఇంటర్మీడియెట్ ఫలితాలు వెల్లడి కావడంతో విద్యార్థులంతా ఈఏపీ సెట్‌కు సిద్ధమౌతున్నారు.

మే 19 నుంచి ఈఏపీ సెట్ పరీక్షలు

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశించే వారి కోసం మే 19వ తేదీ నుంచి ఈఏపీ సెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. మే 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. షెడ్యూల్‌లోని ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, అనంతరం మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకూ ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలు రాయడానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకూ గడువు ఉంది.

ఉమ్మడి పశ్చిమలో 13,330 సీట్లు

ఇంజినీరింగ్ విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 14 ఇంజినీరింగ్ కళాశాలల్లో కలిపి వివిధ కోర్సులకు సంబంధించి 13,330 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 1,200 సీట్లు, రామచంద్ర కళాశాలలో 900 సీట్లు, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 600 సీట్లు, హేలాపురి కళాశాలలో 360 సీట్లు, ఆగిరిపల్లిలోని ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో 1360 సీట్లు, నూజివీడులోని సారధి ఇంజనీరింగ్ కళాశాలలో 420 సీట్లు ఉన్నాయి. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో 1,860, శ్రీ విష్ణు మహిళా కళాశాలలో 960, శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో 1,140, భీమవరం ఇంజినీరింగ్ కళాశాలలో 300, నరసాపురంలోని స్వర్ణాంధ్ర కళాశాలలో 1,620, తాడేపల్లిగూడెంలోని శ్రీవాసవి కళాశాలలో 1,200, శశి ఇంజనీరింగ్‌లో 1,140, నల్లజర్లలోని వైస్ ఇంజనీరింగ్‌లో 270 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాక మరో 10 శాతం సీట్లు అంటే 1333 సీట్లు ఈడబ్ల్యూస్ కోటాలో కేటాయిస్తారు. అంటే మొత్తం కలిపి 14,663 సీట్లు ఈ రెండు జిల్లాల్లోని కళాశాలల్లో అందుబాటులో ఉంటాయి.

ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ

ఈ పరీక్షలకు గత సంవత్సరం మాదిరిగానే ఇంటర్మీడియెట్‌లో అభ్యర్థి సాధించిన మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇస్తారు. ఈఏపీ సెట్ మార్కులకు 75 శాతం వెయిటేజీ ఇచ్చి మొత్తం కలిపిన తరువాత ర్యాంకును ప్రకటిస్తారు. ప్రస్తుతం దరఖాస్తులు చేస్తున్న ఉరవడి పరిశీలిస్తే గత ఏడాది కంటే మరో 10 శాతం దరఖాస్తులు పెరగనున్నట్లు ఈ పరీక్షలు నిర్వహిస్తున్న జేఎన్‌టీయూ కాకినాడ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈఏపీ సెట్‌లో ప్రధానంగా కంప్యూటర్ ఆధారిత కోర్సులకే విద్యార్థుల నుంచి ఆసక్తి కనిపిస్తోంది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే గత ఏడాది వరకూ తెలంగాణ విద్యార్థులకు నాన్‌లోకల్ కేటగిరీ కింద 15 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవారు. అయితే రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు పూర్తయినందున ఈ ఏడాది నుంచి వారికి రిజర్వేషన్ వర్తించదు. కాబట్టి మొత్తం సీట్లలో స్థానిక అభ్యర్థులతోనే భర్తీ చేయనున్నారు. దీనివల్ల ఆంధ్ర విద్యార్థులకు కొద్దిగా పోటీ తగ్గనుంది.

ఉత్తీర్ణులైతేనే ఫీజు రీయింబర్స్‌మెంట్



ఈఏపీసెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. 160 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షకు 40 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులైనట్టే. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆశించే విద్యార్థులు ముందుగానే ఇన్‌కం ట్యాక్స్ సర్టిఫికెట్, ఈ ఏడాది తాజాగా తీసుకున్న కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచుకోవాలి. అలాగే ఓసీల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇచ్చే 10 శాతం రిజర్వేషన్ కోటా (ఈడబ్ల్యూఎస్)లో చేరే విద్యార్థులు ముందుగానే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను పొందిఉండాలి. పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డుల్లో తమపేరు అక్షరం కూడా తప్పులేకుండా ఉండేలా జాగ్రత్తపడాలి.

– పీ బాలకృష్ణ ప్రసాద్, ఈఏపీసెట్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్

రెండోరోజూ మట్టి నమూనాల పరిశీలన


పోలవరం ప్రాజెక్టులో మట్టి నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తున్న కేంద్ర నిపుణుల బృందం సభ్యులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో మట్టి నాణ్యత పరీక్షలను గురువారం రెండవ రోజు కూడా కేంద్ర బృందం సభ్యులు పరిశీలన చేశారు. సెంట్రల్ మెటీరియల్ అండ్ సాయిల్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు బి.సిద్ధార్థ హెడవో, విపుల్ కుమార్ గుప్త ప్రాజెక్టు ప్రాంతంలోని దండంగి, జలవిద్యుత్ కేంద్ర పరిసర ప్రాంతాల్లో నిల్వ చేసిన మట్టి నమూనాలు సేకరించారు. ఈ మట్టిని స్థానిక లేబోరేటరీలో పరీక్షించడంతో పాటు మరింత సూక్ష్మంగా పరిశీలించేందుకు ఢిల్లీ కేంద్ర కార్యాలయంలో పరీక్షించేందుకు సేకరించారు. క్షేత్రస్థాయిలో సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ సెంటర్‌లో నిర్వహించే పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా పోలవరం ప్రాజెక్టులో ఈసీఆర్ఎఫ్, డయాఫ్రమ్‌వాల్ ప్రాంతాల్లో అవసరమైన మేర ఈ మట్టిని వినియోగిస్తారని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వీరి వెంట ప్రాజెక్టు ఈఈ శ్రీనివాసులు, డీఈ వి.నిర్మల, మేఘ ఇంజనీరింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ సీహెచ్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి


లంకలకోడేరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆయుష్మాన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

పాలకొల్లు సెంట్రల్: ఆయుష్మాన్ భారతి నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించి 23 శాతం జీతం పెంచాలని లంకలకోడేరు పీహెచ్‌సీ కన్వీనర్ గౌతమి తెలిపారు. గురువారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, సీహెచ్‌ఓలుగా పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాల సమస్యలు పరిష్కరించాలంటూ స్థానిక ఎన్‌జీఓ యూనిట్ అధ్యక్షుడు గుడాల హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ పని ఆధారిత ప్రోత్సాహకాలను సవరించాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సుజిత, రాజశ్రీ, యువతేజ, స్రవంతి, కృష్ణవేణి, లిఖిత, శైలజ, శిరీష, అన్నప్రైస్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు

- తామేమి నామినేటెడ్ సభ్యులం కాదని జెడ్పీటీసీల మండిపాటు
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- సమావేశానికి ప్రజాప్రతినిధుల గైర్హాజరు



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే ఆరిమిల్లి, జేసీలు

ఏలూరు (టూటౌన్): అధికారులు కనీసం ప్రొటోకాల్ పాటించడం లేదని, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని పలువురు వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు మండిపడ్డారు. తామేమీ ప్రభుత్వ పెద్దలచే నామినేటెడ్ అయిన సభ్యులం కాదని ప్రత్యక్షంగా ఎన్నికల్లో ప్రజల చేత ఎన్నుకోబడిన సభ్యులమని గుర్తు చేశారు. గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశం వాడీవేడిగా సాగింది. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పి.ధాత్రీ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, చిర్రి బాలరాజు,, జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్లు టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్.చిన్న రాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా మంచినీటి చెరువులను నింపాలి

ఉమ్మడి జిల్లాలో పంట కాలువలను ఈ నెల 22తో కట్టివేస్తున్నందున అన్ని మంచినీటి చెరువులను గడువులోగా నీటితో నింపుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా సమావేశంలో ఎకరాకి 50 బస్తాల వరకే ధాన్యం కొనుగోలు చేయడంపై పలువురు డెల్టా జెడ్పీటీసీలు వ్యవసాయాధికారులను నిలదీశారు. ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. అలాగే తమ మండలంలో చేపట్టే పనుల ప్రతిపాదనలు సమర్పించినా జెడ్పీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు నిలదీశారు. తాము ప్రతిపాదించిన పనులను టేకప్ చేయకండా ఎవరో చెప్పిన పనులను మాకు తెలియకుండా ఎలా చేపడతారు అంటూ ప్రశ్నించారు.

అందరినీ సమానంగా చూడాలి

ఎమ్మెల్సీ వంకా రవీంద్ర మాట్లాడుతూ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వస్తే పుష్పగుచ్ఛం ఇచ్చి మరీ వేదిక మీదకు ఆహ్వానించారని అదే తాను వస్తే సాధారణంగా పైకి ఆహ్వానించారని ఇదెక్కడి పక్షపాతమంటూ ప్రశ్నించారు. జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు గత 18 నెలలుగా వేతనాలు రావడం లేదని, వీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పీఎంజీపీవైలో 2023–24లో 94 దరఖాస్తులు అందగా వాటిలో 34 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని, 2024–25లో 84 దరఖాస్తులు అందగా 48 మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయన్నారు. ఇలా అయితే ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసేలా చూడండి

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులకు త్వరగా ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు జిల్లాలకు సంఖ్యా బలం ఆధారంగా సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి నియోజకవర్గానికి రూ.25 కోట్లు కేటాయించగా తాడేపల్లిగూడెంకు మాత్రం రూ.7 కోట్లు కేటాయించారని సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకులు మంజూరైనా పనులు మొదలు కాక తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయారు

ప్రజలు పడుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సి ఉంది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలో కూటమికి చెందిన 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నా హాజరైంది మాత్రం ముగ్గురే. అందులో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పోలవరం ఎమ్మెల్యే చిర్రిబాలరాజు వచ్చామా.. నాలుగు పలుకులు పలికామా.. అన్నట్లు పలికి వెళ్లిపోయారు. మధ్యలో వచ్చిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సభ పూర్తయ్యేవరకు ఉన్నారు.

వందశాతం లక్ష్యాలను పూర్తి చేయాలి

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వందశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

అలరించిన జాతీయస్థాయి నాటిక పోటీలు


రవీంద్రరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం


'ఇది అతని సంతకం' నాటికలోని ఓ సన్నివేశం

పట్టణంలోని కళారంజని నాటక అకాడమీ 14వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీసోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీలు ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి. పోటీల్లో గురువారం ప్రదర్శించిన గుంటూరు వారి అభినయ ఆర్ట్స్ 'ఇది అతని సంతకం', హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరు వారి ×సారీ రాంగ్‌నెంబర్‌Ê నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన ఎస్ రవీంద్ర రెడ్డిని ప్రముఖ సినీనటుడు ఎస్వీ రంగారావు స్మారక పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో కళారంజని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథీశ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వై వెంకటరమణ, మెంటే పూర్ణచంద్రరావు, మల్లుల సీతారామప్రసాద్, మాదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

–భీమవరం

రక్తదానంతో ప్రాణదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ

భీమవరం (ప్రకాశంచౌక్): రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ అన్నారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం, పాలకొల్లు, తణుకు, నరసాపురం, భీమవరం రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లలో బ్లడ్ డొనేషన్ క్యాంపులను నిర్వహించారు. ఆయా బ్లడ్ డొనేషన్ క్యాంపులో పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్ అరుణశ్రీ భీమవరం రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎంఎస్‌వీ భద్రిరాజు చేతుల మీదుగా బ్లడ్ డొనేషన్ చేసిన దాతలకు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. సుమారుగా 90 మంది జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగులు, అధికారులు రక్తదానం చేశారు.

జీతాలు ఇవ్వండి.. మహాప్రభో!

17వ తేదీ గడచినా ట్రిపుల్ ఐటీలో ఇంకా అందని జీతాలు


నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు: జీతాలు సకాలంలో అందక ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను వేస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నప్పటికీ అవి కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న దాదాపు 1000 మంది టీచింగ్, నాన్ టీచింగ్, పర్మినెంట్ ఉద్యోగులకు ఈనెల 16వ తేదీ గడచినా ఇంతవరకు జీతాలు చెల్లించలేదు. దీంతో కుటుంబ ఖర్చులకు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో పనిచేసే ఉద్యోగుల్లో పర్మినెంట్ ఉద్యోగులు 30 మంది లోపే ఉండగా మిగిలిన వారంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం యూనివర్సిటీనే నెల ప్రారంభంలోనే వేతనాలను చెల్లిస్తుంది. పర్మినెంట్, కాంట్రాక్టు ఉద్యోగులుగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెంటార్లు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లకు మాత్రం ఈ నెల 17వ తేదీ వరకు కూడా వేతనాలు జమ కాలేదు. ఈ నెల మొదటి వారం నుంచి జీతాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నామని వారు వాపోతున్నారు. సకాలంలో ఇవ్వకపోవడం వల్ల వైద్యం ఖర్చులు, పిల్లల ఫీజుల చెల్లింపు, నెలవారీ మందుల ఖర్చులు, పాల బిల్లులు, సరకుల బిల్లులు ఇలా అనేక వాటికి చెల్లించలేకపోతున్నామని లబోదిబోమంటున్నారు.

అడ్వాన్సులతో కాలక్షేపం

జీతం డబ్బులు నెలలో సగం రోజులు గడచినా రాకపోవడంతో యూనివర్సిటీ అధికారులు వర్సిటీ నిధుల్లో నుంచి ఎవరైతే అడ్వాన్సులు కావాలని అడిగారో వారికి జీతంలో సగం మొత్తం అడ్వాన్సులు ఇచ్చారు. దీంతో అధిక శాతం మంది తమ జీతంలో 50 శాతం అడ్వాన్సు తీసుకొని కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో జీతాలను విడుదల చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

బడ్జెట్ మంజూరైంది

వేతనాలకు సంబంధించి బడ్జెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. రెండు రోజుల్లో కాంట్రాక్టు, పర్మినెంట్ ఉద్యోగులకు సంబంధించి జీతాలు వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయి. ప్రతినెలా సకాలంలోనే జీతాలను ప్రభుత్వం విడుదల చేస్తోంది.

– బి.లక్ష్మణరావు, ఏఓ, నూజివీడు ట్రిపుల్ ఐటీ

క్లుప్తంగా

జగన్నాథపురంలో పోషణ పక్వాడ


చిన్నారులతో మాట్లాడుతున్న డాక్టర్ సింధు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం పీహెచ్‌సీ డాక్టర్ సింధు పోషకాహారం గురించి విద్యార్థులకు వివరించారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తు పిల్లలు ఉండే విధంగా తల్లులు పిల్లల ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


వాకర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మిచే గురువారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాహార్తులకు మజ్జిగ అందజేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని పాదచారులు, వాహనదారులు దప్పిక తీర్చుకోవాలని కోరారు. దాహార్తుల కోసం దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. చలివేంద్రంలో కుంట్ల కనకదుర్గ, దుగ్గిన వెంకట లక్ష్మి, వనచర్ల భార్గవి, కె.మేరీవజ్రమ్మ, కె.నరసింహమూర్తి, కుంట్ల రామ్మోహన్‌రావు, కె.వీర్రెడ్డి, ఎ.జనార్ధనరావు, వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరులో గురువారం జరిగిన పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా, జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్సీ వంక రవీంద్ర నాథ్ పాల్గొని వివిధ సమస్యలను ప్రస్తావించారు. చిన్న తరహా పరిశ్రమలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేరడం లేదని, పరిశ్రమల శాఖ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపి లబ్ధి దారులకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు. తణుకు మండలంలోని తేతలి గ్రామంలో ఉన్న పశు వధ కర్మాగారానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు నిరసన తెలుపుతున్నా, అధికారులు పట్టించుకోకుండా పోలీసులతో ప్రజలను భయభ్రాంతులు చేయడం చాలా దారుణం అని అన్నారు. రవాణా శాఖ, పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ శాఖ సంయుక్తంగా సమస్యలను తెలుసుకొని చుట్టు ప్రక్కల ప్రజలను కర్మాగారం లోపలకి తీసుకెళ్లి వాస్తవాలను తెలియపరచాలన్నారు. తగిన ట్రీట్మెంట్ పరిస్థితి లేకపోతే కర్మాగారాన్ని వేరే ప్రాంతాలకు తరలించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపారు. అందునా ముఖ్యమంత్రి వచ్చి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర ప్రారంభించిన ప్రాంతాలల్లో పంచాయతీ అధికారులు ఈ విధంగా చేయడం ఏమిటని ప్రశ్నించారు.

దువ్వలో ఆర్టీసీ కార్గో పాయింట్ ప్రారంభం

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలను ప్రయాణికులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో గురువారం పవన్ సెల్ పాయింట్ వారికి ఆర్టీసీ కార్గో పార్సిల్స్, కొరియర్స్ బుకింగ్, టికెట్ రిజర్వేషన్ సదుపాయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంత సురక్షితమో ఆర్టీసీ కార్గో కూడా అంతే సురక్షితంగా పార్సిల్స్‌ను గమ్యానికి చేరుస్తాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తణుకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, దువ్వ ఏజెంట్ కేశవరపు పవన్ కుమార్ పాల్గొన్నారు.

కలుషిత నీరు.. తాగేదెలా?

- కలుషిత నీటితో ప్రజలు అవస్థలు
- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పట్టణంలో స్థానిక 12 వ వార్డు పాతూరు శివారు పరిసర ప్రాంతాలలో పురపాలక సంఘం అందజేసే తాగు నీటి కుళాయిలు నుంచి మురికి నీరు వస్తుందని అక్కడ ప్రజలు వాపోతున్నారు. కొన్ని సమయాలలో తోక పురుగులు, ఎర్ర నీరు, దుర్వాసనతో నీరు రావడం జరుగుతుందని చెబుతున్నారు. పురపాలక సంఘ అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అక్కడ వాసులు మునిసిపల్ అధికారులకు విజ్ఞప్తి కూడా చేశారు.

కలుషిత నీటితో ఇబ్బందులు:

ఎంతో కాలంగా ఈ ప్రాంతంలో కలుషిత నీటి సమస్య ఉంది. గతంలో ఈ ప్రాంతంలో డ్రైయినేజ్ ప్రాక్‌లెనైర్‌తో తవ్వకాలు జరిగాయి. భూమి లోపల ఏర్పాటు చేసిన పైపులైన్‌లకు డ్యామేజ్ జరిగిందని చెబుతున్నారు. పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడ్డాయి. డ్రైయిన్‌లలో మురుగు నీరు సైతం కుళాయిలు ద్వారా వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పైపులైన్‌లు నుంచి మురుగు నీరు రాకుండా ఉండేందుకు మునిసిపల్ అధికారులు పలు మార్లు పైపులైన్ మార్గంలో తవ్వకాలు చేపట్టి కొంత మేర లీకేజీలను అరికట్టారు. అయితే అన్ని లీకేజీలను పట్టుకోవడంలో సంబంధిత సిబ్బంది విఫలమైయారు. తుతూ మంత్రంగా పనులు చేయడం షరా మామూలైంది. తాగునీటికి స్థానికులు ఇబ్బందులు తప్పడం లేదు. లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పాతూరు శివారులో కుళాయి నుంచి మురుగు నీరు

ఇటీవల తిరిగి కుళాయి నుంచి మురుగు నీరు

పాతూరు శివారు ప్రాంతంలో ప్రస్తుతం నీటి కుళాయిలు నుంచి మురుగు నీరు వస్తుంది. ఈ కలుషిత నీటి వల్ల విష జ్వరాలు వస్తున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అనారోగ్యం బారీన పడుతున్నారని ఎప్పుడు ఏ అనారోగ్యం వస్తుందోనని ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. స్థానికులు అందరికి రోగాలు వచ్చే అవకాశాలు ఉండటంతో ప్రజలు భయోందోళన చెందుతున్నారు. మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ శాఖ సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కలుషిత నీరు రాకుండా, తమకు కుళాయిలు నుంచి తాగు నీరు అందజేసి ఆదుకోవాలని స్థానికుడు ముదునూరి సతీష్ రాజు కోరారు. తాము అనేక రోజులుగా కలుషిత నీటితో ఇబ్బందులు పడుతున్నాం. రిపేర్లు చేస్తున్నారు. ఫలితం ఉండటం లేదు. లీకేజీలను అరికట్టాలని ఎన్నో సార్లు మొరపెట్టుకున్నాం. సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు స్పందించాలి.

– ముదునూరి సతీష్ రాజు, పాతూరు శివారు స్థానికులు

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం


అవగాహన కార్యక్రమంలో విద్యార్థినులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థి దశ నుంచే క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సామాజిక కార్యకర్త కె.కీర్తన విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు పర్యవేక్షణలో డాక్టర్ ఎస్తేర్ కమల ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, జిక్కిలు మాట్లాడారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, అంబికా, రామాంజనేయులు, రత్నకుమారి, శుభాషిణి, శ్యామలాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించినా, నోరెత్తినా కూటమి దాడులు


తణుకులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- నియోజకవర్గ కార్యకర్తల సమావేశంతో జోష్
- పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు..

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా అన్ని వర్గాలకు ఇంటి గుమ్మంలోకి సంక్షేమం అందజేస్తే, నేటి కూటమి ప్రభుత్వం మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా సూపర్‌సిక్స్ ఎగవేతపై నోరెత్తనివ్వకుండా దాడులకు దిగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు విమర్శించారు. తణుకు సీఎం ఫంక్షన్ హాల్‌లో గురువారం మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు నేత వంగవీటి మోహనరంగాను చంపించిన వారితో చేతుల కలిపి కుట్రపూరిత రాజకీయం చేస్తున్న పవన్ కల్యాణ్ ప్రశ్నించలేక పోతున్నారని దుయ్యబట్టారు. పవన్ రాజకీయ జీవితమంతా సొంత జెండా, ఎజెండా లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. బహుజన కులాల రాష్ట్ర నాయకులు చింతపల్లి గురు ప్రసాద్ మాట్లాడుతూ ఒక బీసీ నాయకుడైన మాజీ మంత్రి కారుమూరి రాజకీయాల్లో చిన్నస్థాయి నుంచి ఎదిగి వచ్చారని, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ గాలివాటంలో గెలిచి అధికారమదంతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి పదవితో అహంకారం తలకెక్కి మాట్లాడితే బహుజన కులాల మీ ఇంటిని చుట్టుముట్టి వేసే అరుపులకు కొట్టుకుపోతావని ధ్వజమెత్తారు.

జోష్ నింపిన కార్యకర్తల సమావేశం..

తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. తణుకు జాతీయ రహదారిలోని సీఎం ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశానికి నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కూటమి ప్రభుత్వ నేతల బెదిరింపులు, దాడులు, మారణకాండకు వెరవకుండా పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయితీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, పంపన అంజిబాబు, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఏఎంసీ మాజీ ఛైర్‌పర్సన్‌లు ఉండవల్లి జానకి, నత్తా కృష్ణవేణి, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు షేక్ ఫహీమా, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ

అత్తిలి: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తిలి అగ్నిమాపక అధికారి కొవ్వాసు గంగరాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమన్నారు. ఏ క్లాస్, బీ క్లాస్, సీ క్లాస్, డీ క్లాస్ ఫైర్స్‌ని గుర్తించే విధానం, వాటిపై వాడే పరికరాల గురించి తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఫైర్ ఎక్స్టింగ్ విషర్‌ను ఏవిధంగా ఉపయోగించాలో వివరించారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు, అగ్నిమాపక పరికరాలు ఉపయోగించే విధానంపై డెమో ఇచ్చారు. విద్యార్థులు వేసవి సెలవుల నిమిత్తం జల విహారాలకు వెళ్లినపుడు లైఫ్ జాకెట్ ధరించే విధానం, లైఫ్ బోట్ వాడే విధానం తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భంలో పొగనిండిన గదిలోకి ప్రవేశించి లోపల చిక్కుకున్న వారిని తీసుకువచ్చే విధానం గురించి ఫైర్ ఆఫీసర్ కె గంగరాజు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


అగ్నిప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి కె గంగరాజు

గ్యాస్ వినియోగంపై అప్రమత్తత అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో గురువారం నాల్గోవ రోజు గోయెంకా కళాశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన, మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు– తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా సంస్థలలో ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలో వివిధ విన్యాసాలను ప్రదర్శించారు. తొలుత పట్టణంలో ర్యాలీ జరిగింది. కరపత్రాలను పంపిణీ చేశారు. రామారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రారంభ దశలోనే వాటిని అరికట్టాలని, పెను ప్రమాదాలు జరగకుండా చూడవచ్చునని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


మాక్ డ్రిల్‌లో కళాశాల విద్యార్థులు, ఫైర్ సిబ్బంది

అప్రమత్తతే కీలకం

తణుకు అర్బన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం తణుకు రూట్స్ స్కూల్‌లో అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బహుళ అంతస్థుల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు విద్యార్థులను బయటకు ఎలా తరలించాలనే విషయాలతోపాటు మంటల నుంచి తప్పించుకోవడం వంటి అంశాలను ప్రయోగాత్మకంగా చూపించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అందరినీ ఆదుకోవాలన్నారు. ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాని కోరారు. ఈ కార్యక్రమంలో రూట్స్ స్కూలు ప్రిన్సిపాల్ ఎలికే త్రిపాఠి, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఇళ్లస్థలాల అర్జీదారులతో గురువారం పట్టణంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని చెప్పారని నేటికి అమలు చేయలేదన్నారు. స్థలాలు ఇవ్వడంతో పాటు నిర్మాణానికి 4 లక్షలు కేటాయించాలని కోరారు. 10 నెలలు కావస్తున్న ఇళ్ల స్థలాల హామీ నెరవేర్చకపోవడంతో పేదలలో అనేక అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.సీతారాంప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సభ్యులు వడ్డాది మేరీ, సీపీఐ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


ఇళ్ల స్థలాల సాధన కమిటీతో సీపీఐ నాయకులు

సినిమా న్యూ లుక్స్

- కాన్‌ప్లెక్స్ సినిమా
- ఏపిలో గూడెం నుంచి శ్రీకారం


ఇంటీరియర్ న్యూలుక్


గూడెంలో ఏర్పాటు చేసిన స్క్రీన్

తాడేపల్లిగూడెం: సినిమా న్యూ లుక్స్ కు, లగ్జరీ, సాంకేతికతకు అత్యాధునిక చిరునామాగా చెప్పుకొనే కాన్‌ప్లెక్స్ చైన్ సినిమా ఏపిలో తన తొలిఅడుగును జిల్లాలోని ప్రధాన వాణిజ్యకేంద్రం తాడేపల్లిగూడెం నుంచి శుక్రవారం ప్రారంభించనుంది. రెక్లటనర్స్, సెమీ రిక్లైనర్స్, డాల్బీసౌండ్ 7.1 సౌకర్యంతో బొమ్మ అదుర్స్ అన్నట్టుగా చూపించనుంది. దేశవ్యాప్తంగా 230 స్క్రీన్లను నిర్వహిస్తున్న చరిత్ర కలిగిన ఈ సంస్థ మరో కొత్త స్క్రీన్లను అందించాలనే ఆశయంతో ఉన్న ఈ సంస్థ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీశ్రీ స్క్వేర్ లో అధునాతన సౌకర్యంతో సినిమాను చూపించనుంది.ఎక్స్‌ప్రెస్, సిగ్నేచర్, విలాసవంతమైన మూడు రకాల స్క్రీన్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. వీటికి తోడుగా చక్కని రుచులను అందించే రెస్టారెంట్ సౌకర్యాన్ని వాడుకలోకి తెచ్చింది. ఈ మజాను అన్ని తరాలు ఆస్వాదిస్తారని నిర్వాహకులు భావిస్తున్నారు.

చిన్నపాటి నీటి నిల్వలే దోమ పుట్టుకకు కారకాలు


పైడిపర్రులో పరిసరాల పరిశుభ్రతపై కరపత్రాలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: దోమ పుట్టుకకు కారకాలైన చిన్నపాటి నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. పైడిపర్రులో గురువారం వెక్టార్ కంట్రోల్ హైజీన్, దోమ కాటు వ్యాధుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుపయోగకరంగా ఉన్న సామగ్రి, డ్రైయినేజీల్లో చెత్త చెదారాలను వేయడం వలన మురుగునీరు పారుదలకు ఆటంకం కలిగి దోమల వ్యాప్తి చెందుతుందని స్పష్టం చేశారు. వారానికి ఒకసారి ఇంటి ఆవరణలో నీటినిల్వ ఉన్న పనికిరాని సామగ్రిని తొలగించుకోవాలన్నారు. పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, దోమల నియంత్రణ అందరిబాధ్యత అని వివరించారు. గుర్తించిన బ్రీడింగ్ సోర్స్‌ను వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో సంబంధిత వార్డు హెల్త్ సెక్రెటరీచే అప్లోడ్ చేయించారు. వార్డుహెల్త్ సెక్రెటరీ వి.బులిపండు, ఆశా కార్యకర్త విజయ పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతకు అందరూ సహకరించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాలాజీ వెంకటరమణ

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామ పరిశుభ్రతకు అందరూ సహకరించాలని ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాలాజీ వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలోని మారంపల్లి శిక్షణ కేంద్రం వద్ద గ్రామ సర్పంచ్ సరిపల్లి పద్మ అధ్యక్షతన మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాలాజీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. తద్వారా వర్మీకంపోస్టు తయారీ సులభతరం అవుతుందన్నారు. అనంతరం క్లాప్ మిత్రలు నూతంగి రవి, ఎం.బాబూరావులను సత్కరించి, నగదు బహుమతి అందజేశారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, డిప్యూటీ ఎంపీడీవో ముప్పిడి వెంకటేష్, గ్రామ ఉప సర్పంచ్ సరిపల్లె పెద్ద వెంకట్రాజు (చిట్టి బాబు), డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ పాండురంగారావు, జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్, మండల రీసెర్చ్ కోఆర్డినేటర్ ఎం. రవికిరణ్, కార్యదర్శి ఎం.డి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.